

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, పక్కన మంత్రి గంగుల కమలాకర్



6వ డివిజన్‌లో బోనాలతో తరలివచ్చిన మహిళలు

# భూకబ్జాదారుడికి కాంగ్రెస్ టికెట్

- మేము అభివృద్ధి చేస్తుంటే బీజేపీ అడ్డుకుంటున్నది
- బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని 6, 7, 30వ డివిజన్లలో ప్రచారం

కార్పొరేషన్, నవంబర్ 15: భూకబ్జాదారులు, రౌడీషీటర్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని, అలాంటి వారిని గెలిపిస్తే మన భూములు ఉంటాయా... ప్రభుత్వ భూములు మిగులుతాయా అని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగరంలోని 6, 7, 30వ డివిజన్లలో బుధవారం సాయంత్రం ఆయన రాష్ట్ర ప్రణాళికా ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో కలిసి ప్రచారం చేశారు. మంత్రికి బోనాలు, డప్పుచప్పుళ్లు, మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ టికెట్లను అమ్ముకుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిపై ఇప్పటికే 32 భూ కేసులు ఉన్నాయని, అలాంటి వ్యక్తిని గెలిపించుకుంటే ప్రజల భూములు మిగలవని, ఎన్ని కేసులు నమోదవుతాయో ఆలోచించాలన్నారు. మరోవైపు నగరంలో తాము అభివృద్ధి చేస్తుంటే బీజేపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీ బండి సంజయ్ ఈ నాలుగున్నర ఏండ్లలో ఏ రోజైనా మనకు కనిపించారా అని ప్రశ్నించారు.? నగరంలో జరుగుతున్న అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మి వారిని గెలిపిస్తే ఇప్పుడు వస్తున్న కరెంటు రాకుండా పోతుందని, మళ్లీ తాగునీటి కోసం తిప్పలు పడే పరిస్థితి వస్తుందన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును కాంగ్రెస్, బీజేపీ కొనసాగిస్తాయా అని ప్రశ్నించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కోల మాలతి-సంపత్, ఆకుల పద్మ, నేతికుంట యాదయ్య, నాయకులు బాలు, నరేందర్, ఐలయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన వినోద్‌కుమార్ ప్రయత్నం

- బీఆర్ఎస్‌కు మద్దతుగా బరిలో నుంచి తప్పకున్న స్వతంత్ర అభ్యర్థి

కార్పొరేషన్, నవంబర్ 15: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు శుక్రొద్దీన్ బుధవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అంతకు ముందు శుక్రొద్దీన్‌తో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడారు. పార్టీ కోసం పని చేయాలని సూచించారు. దీంతో ఆయన తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని అనంతరం వినోద్‌కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



శుక్రొద్దీన్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

# సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, నవంబర్ 15: చొప్పదండి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో సీఎం సభా స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ వస్తున్నందున నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పర్యటనతో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి, గంగాధర, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలాగౌడ్, మెన్నేని రాజనర్సింగరావు, గంగాధర, కొడిమ్యాల మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మడ్లపెల్లి గంగాధర్, పునుగోటి కృష్ణారావు, గంగాధర, కొడిమ్యాల బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మేచినేని నవీన్‌రావు, పులి వెంకటేశ్‌గౌడ్, సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర్, నాయకులు మడ్లపెల్లి రమేశ్, వాసాల గంగాధర్, తాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- మానకొండూర్ మండలంలోని ముదిరాజ్ కులస్తులతో సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, నవంబర్ 15: ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే జీవితాంతం మీకు అండగా ఉంటానని బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల ముదిరాజ్ కులబాంధవులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడారు. తెలంగాణ ఏర్పడక ముందు ముదిరాజ్ కులస్తుల జీవన పరిస్థితి ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందో ఆలోచించాలని సూచించారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో అన్ని మండల కేంద్రాల్లో చేపల మార్కెట్లు, ఎల్ఎండీ కాలనీలో చేపల కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తానని తెలిపారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్‌తోనే సబ్బండ వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ నాయకులను నమ్మితే గోసపడుతామని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాతరోజులు పునరావృతమవుతాయని, రైతులకు కరెంట్ కష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రసమయిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ముదిరాజ్ కుల బాంధవులు ధైర్యంగా ఉండు బిడ్డా మళ్లీ నీవే గెలుస్తావు... మా మద్దతు నీకే ఉంటుందని' అని రసమయి బాలకిషన్‌ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గడ్డం నాగరాజు, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు, కులబాంధవులు, తదితరులు పాల్గొన్నారు.



గంగుల కమలాకర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి మద్దతు తెలుపుతున్న శివశక్తి టిప్పర్ అసోసియేషన్ నాయకులు

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కార్పొరేషన్, నవంబర్ 15: నగరంలోని పలు డివిజన్లకు చెందిన యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో బుధవారం మంత్రి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే, నగరంలోని శివశక్తి టిప్పర్ అసోసియేషన్ నాయకులు బుధవారం మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతు ప్రకటించారు. శివశక్తి టిప్పర్ అసోసియేషన్ సలహాదారు గుంజపడుగు హరిప్రసాద్, సంఘం అధ్యక్షుడు చందు, ప్రధాన కార్యదర్శి అభిలాష్ ఆధ్వర్యంలో మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ, కరీంనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్, నాయకులు వాసాల రమేశ్, జమీలొద్దీన్ పాల్గొన్నారు.


## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

చొప్పదండి (రామడుగు), నవంబర్15: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు బుధవారం ఎమ్మెల్యే రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు దాసరి అనిల్, సభ్యులు సంపత్, హరీశ్, సాగర్, రాజు, శేఖర్ సన్ని, వెంకటేశ్, దాసరి ప్రశాంత్, వెంకటేశ్, సిద్ధు, మనోజ్, అరవింద్, డేవిడ్ రాజ్, వంశీ, వెంకటేశ్ తదితరులున్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, నాయకులు దాసరి రాజేందర్ రెడ్డి, పూడూరి మల్లేశం, వేల్పుల హరికృష్ణ, పాపిరెడ్డి, శ్రీనివాస్, ఆనందం, మల్లేశం, బాబు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ యువజన సంఘం సభ్యులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ యువకులు



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 15: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి యువత పార్టీలో చేరుతున్నారని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. స్థానిక మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో బుధవారం కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌కు చెందిన 40 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మేయర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకుడు గంగుల హరిహరణ్ తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుకు సత్కారం

రాంనగర్, నవంబర్ 15: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సమ్మిరెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. కమిషనరేట్ కేంద్రంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి కార్యాలయంలో సమ్మిరెడ్డిని పూలమాల, శాలువాతో సత్కరించారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. 5 వేల చెక్కు అందజేశారు.

# టీటీడీ ఆలయ నిర్మాణానికి రూ. 15.54 కోట్లు

- టెండర్లు ఖరారు చేసిన టీటీడీ పాలక మండలి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 15: జిలా కేంద్రంలోని పద్మనగర్‌లో నిర్మించనున్న పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణనికి టెండర్లు ఖరారు చేస్తూ టీటీడీ పాలక మండలి సభ్యులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన పాలక మండలి సమావేశంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, బోర్డు సుభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా, కరీంనగర్‌లో నిర్మించనున్న ఆలయం కోసం రూ. 15 కోట్ల 54 లక్షలకు టెండర్లు ఖరారు చేశారు.